## క్లుప్తంగా

### ఇంటర్న్‌షిప్ కోర్సుకు విద్యార్థినుల ఎంపిక

**మర్రిగూడ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన ఆరుగురు విద్యార్థినులు చండూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది రోజుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివ స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.ఆంజనేయులు, ఒకేషనల్ ట్రైనర్ వసంతలు పాల్గొన్నారు.

### లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

**నల్లగొండ టౌన్ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పదో వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట సుధాకర్ జెండా ఎగురవేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెరుపల్లి నిరంజన్, కార్యదర్శి రావుల రవికుమార్, కోశాధికారి పాలా రమేష్, ఉపాధ్యక్షులు మహేష్, అనిల్‌కుమార్, అశోక్‌రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కుమ్మర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అబ్బయ్య

**మర్రిగూడ :** కుమ్మర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మర్రిగూడ మండలంలోని మేటి చందాపురం గ్రామ పంచాయతీ పరిధి ఇందుర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ అబ్బయ్య ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ చేతుల మీదుగా అబ్బయ్య నియామక పత్రం అందుకున్నారు.

### పోషకాహార కిట్లు అందజేత

**నాంపల్లి :** స్థానిక ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు గురువారం పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైద్యపరీక్షలు

**నాంపల్లి :** శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు, గతంలో తేమడ పరీక్షలు చేసుకొని నెగిటివ్, పాజిటివ్‌గా వచ్చిన వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నుంచి ప్రత్యేక వైద్యులు రానున్నందున్న వైద్య పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

### వివాదాస్పదంగా పూజలు

**నకిరేకల్ :** మున్సిపాలిటీ కేంద్రంలోని చీమలగడ్డలో తాటికల్ పీఏసీఎస్(ప్రాథమిక పరపతి సహకార సంఘం) కార్యాలయం ఆవరణలో బుధవారం రాత్రి స్థానికులు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఆ విగ్రహం ఎదుట చీమలగడ్డ వాసులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేయడంతో వివాదాస్పదంగా మారింది. రెండు నెలల క్రితం ఇక్కడ కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో కార్యాలయ ఆవరణలో గతంలో ఆంజనేయ స్వామి విగ్రహం ఉందని స్థానికులు అభ్యంతరం తెలిపిన విషయం విదితమే. తాజాగా ఇదే స్థలంలో రాత్రికి రాత్రే విగ్రహం పెట్టి పూజలు చేయడంతో పీఏసీఎస్ కార్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాజశేఖర్, ఎస్ఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

### విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

**శాలిగౌరారం :** శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఎదుట నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు శేషభట్టర్ నర్సింహాచార్యులు, రత్నమాచార్యులు, రామచంద్రాచార్యులు, జగన్మోహనాచార్యులు, విగ్రహదాత చాడ కిషన్‌రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**నార్కట్‌పల్లి :** మండలకేంద్రంలోని కామినేని హాస్పిటల్‌లో గురువారం ప్రపంచ ఆస్టియో పోరోసిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ లూథర్ మాట్లాడుతూ ఎముకలు ధృడంగా ఉంటేనే అన్ని పనులు సక్రమంగా చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, హెచ్‌డీఓ భానురేఖ, వైద్యులు అనిల్‌కుమార్, హరనాథ్ పాల్గొన్నారు.

### ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**కట్టంగూర్ :** త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ డి.స్వప్న అధికారులకు సూచించారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులకు ఎన్నికలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటు హక్కు కలిగిఉన్న ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి మోహన్‌రెడ్డి, డీటీ సుకన్య, ఎంపీడీఓ సునిత, ఏపీఓ రాంమోహన్, ఏపీఎం వినోద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ టీచర్స్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# నిలిచిన కృష్ణా జలాల సరఫరా

- నాలుగు రోజులుగా మరమ్మతు పనులు
- వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న ప్రజలు


ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం

**మర్రిగూడ :** కృష్ణా జలాల సరఫరా నాలుగు రోజులుగా నిలిచిపోవడంతో మర్రిగూడ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీలు, 25 ఆవాస ప్రాంతాల్లో 36,968 మంది జనాభా ఉన్నారు. వీరందరికీ సరిపడా నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.

**20 లీటర్ల నీటికి రూ.10...**

మర్రిగూడ మండల వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి కృష్ణా జలాల సరఫరా నిలిచిపోయింది. నాంపల్లి మండలం లింగోటం వద్ద ఉన్న కృష్ణాజలాలు శుద్ధి కేంద్రంలో పంపింగ్ వద్ద నాన్ రిటర్న్ వాల్వ్ మరమ్మతులకు గురైంది. ఇటీవల దానిని సరిచేయగా నీటిని వదులుతున్న క్రమంలో పైపు పగిలిపోవడంతో సరఫరా నిలిచినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. కృష్ణాజలాలు అందకపోవడంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల వద్ద ప్రజలు 20 లీటర్లకు రూ.10చొప్పున నీటిని కొనుగోలు చేస్తున్నారు. కృష్ణా జలాలు తాగిన వారు ఫిల్టర్ నీటిని తాగడం వల్ల గొంతు నొప్పి వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. గ్రామాల్లోకి ఫిల్టర్ నీరు ఆటోల ద్వారా సరఫరా చేస్తుంటారు. లేదంటే మండల కేంద్రంలో వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేయడానికి రాంరెడ్డిపల్లి నుంచి 3 కి.మీ., తానెదారుపల్లి నుంచి 4 కి.మీ., చర్లగూడెం 5కి.మీ చొప్పున ద్విచక్ర వాహనాల్లో వెళ్లి నీటిని కొనుగోలు చేయాల్సిందే

**తాత్కాలిక చర్యలతోనే సరి...**

నీటి సమస్యను పరిష్కరించడానికి పలు గ్రామాల్లో నీటి ట్యాంకర్ల ద్వారా ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ నీటి అవసరాలు తీరడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి నిత్యం మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నాలుగు రోజులుగా నీరు రావడం లేదు**



మా ఊర్లో రెండు బోర్లు ఉన్నాయి. ఒక బోరు మరమ్మతులకు గురైందని తీసుకెళ్లారు. దాన్ని బిగించడంలేదు. ఒక్క బోరుతో నీరు పట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. కృష్ణా నీళ్లు నాలుగు రోజుల నుంచి రావడం లేదు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేస్తే బాగుంటుంది.

– మెడిగ లక్ష్మమ్మ, చర్లగూడెం

**భగీరథ నీటిని సరఫరా చేయాలి**



నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నాం. నీళ్లు లేకపోతే ఏ పనులు చేసుకోలేకపోతున్నాం. ఫిల్టర్ నీళ్లు కొనుక్కుని తాగితే గొంతు నొప్పి వస్తోందని అనేక మంది అంటున్నారు. అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలి

– నక్క రాములమ్మ, మర్రిగూడ

**మరమ్మతులు చేపట్టారు**



నాంపల్లి మండలంలోని లింగోటం వద్ద కృష్ణాజలాల నీటి శుద్ధి కేంద్రంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అత్యవసరమైన చోట గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీరుని సరఫరా చేస్తున్నాం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అతి త్వరలో కృష్ణా జలాలను సరఫరా చేస్తాం

– జి.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

### కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

**మునుగోడు :** కాంగ్రెస్ పార్టీ పరిపాలనలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్ అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలో గురువారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

### 'ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిపై దుష్ప్రచారం తగదు'

**నల్లగొండ టూటౌన్ :** నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిల్లి రామరాజుయాదవ్‌పై దుష్ప్రచారం తగదని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ బాధ్యతల నుంచి మృత్యుంజయంను రాష్ట్ర నాయకత్వం తప్పించిందని తెలిపారు. పార్టీ అభ్యర్థి పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాను ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరానని తెలిపారు.

### నగదు, మద్యం పట్టివేత

**చండూరు :** మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామం నుంచి హైదరాబాద్‌కు ఇన్నోవాలో వెళ్తున్న సుంకరి సత్తయ్య నుంచి గురువారం రూ.1,20,000 నగదు ను బంగారిగడ్డ సెంటర్ ఎఫ్ఎస్‌టి–4 పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్ నగదును సీజ్ చేసి ట్రెజరీకి పంపించారు.

**మునుగోడు :** ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.లక్షా 74వేల నగదును గురువారం మునుగోడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన తిరుమల లింగస్వామి తన కారులో నగదు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గూడపూర్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా పట్టుబడింది.

**నాంపల్లి :** రాందాస్‌తండాలో పోలీసులు గురువారం తనిఖీలు చేయగా రూ.10వేల విలువ గల మద్యం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

### కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**చిట్యాల :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, బొంతల చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్‌లోకి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని గురువారం వారు పరిశీలించి మాట్లాడారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**రామగిరి(నల్లగొండ):** రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై తిప్పర్తి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతన వెంకన్న బైక్ సర్వీసింగ్ చేయించుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూర్‌నగర్‌కు చెందిన గండికోట ఉపేందర్ బైక్‌పై వెనక నుంచి వెంకన్న వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో వెంకన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకన్నను నల్లగొండ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంకన్న బావమరిది కొమ్మనబోయిన శంకర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్ఐ ఎస్.ధర్మ తెలిపారు.

### ఐకేపీ కేంద్రం ప్రారంభం

**రామగిరి(నల్లగొండ) :** తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరస్వతీ, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**కనగల్ :** పాటు కాటుకు గురైన దర్వేశిపురం గ్రామానికి చెందిన శ్వేత కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, ఆలయ చైర్మన్ నర్సింహారెడ్డిల ద్వారా అందజేశారు. ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, ఉప సర్పంచ్ జినుకుంట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం


చిట్యాల : పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేముల వీరేశం

**నార్కట్‌పల్లి :** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరినవారిలో ఉప సర్పంచ్ బుర్రి యాదగిరి, సహకార సంఘం డైరెక్టర్ బండ లింగారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు దేవరపల్లి శ్రీధర్‌రెడ్డి, బండ పద్మ, గోలి రజిత, లింగస్వామి, శ్రీనివాసరెడ్డి, రాజు ఉన్నారు.

**చిట్యాల :** మున్సిపాలిటీలో శివనేనిగూడెం(ఒకటో వార్డు)కు చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మన్నెబోయిన మల్లేష్, దేవనక పెద్దులు, గుండాల సత్యనారాయణ, గోకుల జగన్, గొంగ్రా జాన్‌రెడ్డి, ఉపేందర్, చొప్పరి లింగస్వామిలతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో శివనేనిగూడెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంగ్రా మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాపురం లింగస్వామి, మున్సిపాలిటీ ఓబీసీ అధ్యక్షుడు ఎడ్ల మహాలింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రచారం ప్రారంభించిన వేముల వీరేశం**

**నకిరేకల్ :** నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం గురువారం స్థానిక శ్రీ కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నకిరేకల్ పట్టణంలో ప్రధాన రహదారి గుండా కాలినడకన పర్యటిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించాలి

**నల్లగొండ :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మహిళా కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్ త్రిపుర సుందరి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీంలపై ప్రచారం నిర్వహించి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. నాంపల్లి భాగ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు బొడ్డుపల్లి జానకమ్మ, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షురాలు సూరెడ్డి సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎగ్గడి సుజాత, స్వరాజ్యలక్ష్మి, కార్యదర్శి షేక్ జాను, పట్టణ ఉపాధ్యక్షురాలు జిల్లా లింగమ్మ, లలిత, జుబేదా, నవనీత, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

**చండూరు :** శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన కుదబాక్షపల్లి భూ నిర్వాసితులు గురువారం చండూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి మాట్లాడుతూ కుదబాక్షపల్లి పరిధిలో మొదటగా 250 మీటర్ల కట్ట నిర్మాణం అంచనా వేసి, ఆ తరువాత 650 మీటర్లు పొడిగించడంతో కుదాబక్షపల్లి గ్రామానికి చెందిన రైతులు 58 ఎకరాల భూమి కోల్పోతున్నారని అన్నారు. మొదటి మాదిరిగానే 250 మీటర్ల కట్ట నిర్మాణాన్ని కొనసాగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు సీపీఐ నాయకులు బూడిద సురేష్, ఇస్కిల్ల మహేందర్, ఎరుకల నిరంజన్, భూ నిర్వాసితులు మెగావత్ గణేశ్, మాదగోని సైదులు, బ్రహ్మచారి, బలరాం, లక్ష్మయ్య, జానయ్య, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు


నల్లగొండ : ఆర్యన్స్ యోగా సెంటర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు


నల్లగొండ : వేడుకల్లో పాల్గొన్న డాక్టర్లు


బతుకమ్మ ఆడుతున్న కాంగ్రెస్ నాయకురాళ్లు

**నల్లగొండ :** పట్టణంలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, నియోజకవర్గ అధ్యక్షురాలు సూరెడ్డి సరస్వతి, కౌన్సిలర్ బుర్రి రజిత, జూలకంటి ధనలక్ష్మి, కేశాని కవిత, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎగ్గడి సుజాత, స్వరాజ్యలక్ష్మి, జిల్లా లింగమ్మ, తులసి, లింగమ్మ, దీప్తి, లలిత తదితరులు పాల్గొన్నారు.

**ఐఎంఏ ఆధ్వర్యంలో ..**

**నల్లగొండ టౌన్ :** నీలగిరి ఐఎంఏ ఆధ్వర్యంలో ఐఎంఏ భవన్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి డాక్టర్లు అరుంధతి, లీలావతి, రాజేశ్వరి, అనూష, పద్మ, అవంతి, హేమలత, వసుంధర, శోభారాణి, సుచరిత, వసంతకుమారి, గౌరీశ్రీ, లలిత, లావణ్య, దేవిక, డాక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కట్టంగూర్ గ్రామస్తులు

**కట్టంగూర్ :** బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం కట్టంగూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అండర్‌పాస్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. బూటకపు హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీల అమలులో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రం సైదులు, మండల ప్రధాన కార్యదర్శి వడ్డె సైదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెవుగోని జనార్దన్, మేకల రమేష్, అంతటి శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని సాయిమణికంఠ యూత్ సభ్యులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో కట్టంగూర్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, టౌన్ అధ్యక్షుడు చెవుగోని జనార్దన్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో యర్కల మల్లేష్, పోగుల నర్సింహ, నిమ్మనగోటి వెంకన్న, మహేష్, రాములు, భిక్షపతి, సిగ శ్రీను, రమేష్, నాగేష్, లతీఫ్, జాఫర్, ఇమ్రాన్ ఉన్నారు.

**వడ్డెర కులస్తులు బీఆర్ఎస్‌లో చేరిక**

**నకిరేకల్ :** మున్సిపాలిటీలోని 18వ వార్డుకు చెందిన 50 కుటుంబాల వడ్డెర కులస్తులు గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో కంచం వెంకన్న, సంపంగి సురేష్, రుపాని రాంబాబు, వరికుప్పల వెంకన్న, కొడిదల శివ శంకర్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

**చిట్యాలలో..**

**చిట్యాల :** మండలంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ నాయకుడు కందాటి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గడిదల కోటేష్‌తోపాటు మరికొందరు ఉన్నారు.

## అరవై ఏళ్లలో చేయలేని అభివృద్ధి ఐదేళ్లలో చేశా

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


ఎన్నికల ప్రచారం చేస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** అరవై ఏళ్లు పాలించినవారు చేయని అభివృద్ధి తాను ఐదేళ్లలో చేసి చూపించానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణ అభివృద్ధి, సుందరీకరణ పనులను విపక్షాలు అవాంతరాలు సృష్టించినా చేసినట్లు తెలిపారు. అభివృద్ధి నిరోధకులు ఐదేళ్లుగా నల్లగొండకు రాకుండా పోయి ఎన్నికలు అనగానే వచ్చారని అన్నారు. వారి మాయమాటలు నమ్మి మోసపోకుండా ప్రజల మధ్య ఉంటున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించానని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందాయని, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు, తదితర పథకాలు పేదలకు భరోసా కల్పించాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కృష్ణారెడ్డి, యాట జయప్రదరెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, రామ్మోహన్, సింగం లక్ష్మి, చంద్రయ్య, విజయారెడ్డి, పద్మ, ఆవుల రాములు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


లింగంగౌడ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

**మర్రిగూడ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, సర్పంచ్‌లు నల్ల యాదయ్య, పాక నగేష్, దళితబంధు జిల్లా కమిటీ మెంబర్ లపంగి నర్సింహ, కొలుకులపల్లి యాదయ్య, ఊరిపక్క నగేష్ పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులపై ఎంపీడీఓ ఆగ్రహం


ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

**మునుగోడు :** సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులపై మునుగోడు ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు సమావేశాన్ని బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మునుగోడు మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ స్వామి అధ్యక్షతన మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభమైన వెంటనే మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న సమస్యలపై మాట్లాడేందుకు తనకు మైక్ ఇవ్వాలని సభ అధ్యక్షుడు ఎంపీపీ స్వామిని కోరారు. అయితే సర్పంచ్‌కు మైక్ ఇవ్వకుండా ఎంపీడీఓ భాస్కర్‌కు ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కొన్ని విషయాలు మాత్రమే మాట్లాడాలని ఎంపీడీఓ చెప్పే ప్రయత్నం చేస్తుండగా.. తనకు మైకు ఇవ్వాలని, ఇప్పటివరకు తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సర్పంచ్ అన్నారు. దీంతో సర్పంచ్‌పై ఎంపీడీఓ దుర్భాషలాడుతూ గెట్ ఔట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. జెడ్పీటీసీ స్వరూపరాణి కలగజేసుకుని ఓ ప్రజాప్రతినిధిని అగౌరవ పరుస్తారా అని నిలదీశారు. ఆమెపై కూడా ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తంచేస్తూ అవసరమైతే మీరూ వెళ్లిపోండి అన్నారు. వెంటనే కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్నతో మరికొంత మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. ప్రజాప్రతినిధులను గౌరవించడం తెలియదా, సమావేశానికి పిలిచి అవమానపరుస్తారా అంటూ సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎంపీడీఓకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తరువాత ప్రజాప్రతినిధుల వద్దకు ఎంపీపీ వచ్చి సమావేశానికి హాజరుకావాలని, ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి ఆందోళనలు చేయవద్దని కోరారు. అయినా ప్రజాప్రతినిధులు వినకుండా అరగంటపాటు ధర్నా చేపట్టి వెళ్లిపోయారు. చేసేది ఏమీలేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ స్వామి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్న యాదవ్, పగిళ్ల భిక్షం, జక్కలి శ్రీను, తాటికొండ సంతోషసైదులు, పంతంగి పద్మస్వామి, నందిపాటి రాధరమేష్, పందుల మారయ్య, ఎంపీటీసీలు చెర్కు కృష్ణయ్య, బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్, ఈద నిర్మల, వంటిపాక వెంకటమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కు వినియోగంపై ప్రచారం కల్పించాలి

**నల్లగొండ టూటౌన్ :** ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లకు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ఓటు హక్కు వినియోగం, స్వీప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా, డబ్బు, మద్యం, బహుమతులు తీసుకోకుండా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చైతన్యం చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని 55 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ శాతం పెరిగేవిధంగా చూడాలన్నారు. సి విజిల్ యాప్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### దుర్గామాతకు పూజలు

**శాలిగౌరారం :** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చండికాదేవి అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**నాంపల్లి :** మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో, కేతపల్లి గ్రామంలో గురువారం దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.


నాంపల్లి : పూజలో పాల్గొన్న భక్తులు